సాక్షి నంద్యాల

ఆదివారం । 24 । మార్చి । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: నిత్యకళారాధన వేదికపై శనివారం సికింద్రాబాద్‌కు చెందిన పసుపర్తి సాయి దీపిక, కూచిపూడి నృత్య భారతివారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



కల్యాణ వైభోగమే..

దిగువ అహోబిలంలో శనివారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. IIలో▸



కర్నూలులో 'పాణ్యం' నామినేషన్లు

పాణ్యం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు కర్నూలులోనే నామినేషన్ వేయాల్సి ఉంటుందని పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌ఓ నారపురెడ్డి మౌర్య తెలిపారు. IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 4:54
ఆదోని	సా॥ 6:36	ఉ॥ 4:57
నంద్యాల	సా॥ 6:33	ఉ॥ 4:51
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:52
బనగానపల్లె	సా॥ 6:34	ఉ॥ 4:52

హదీస్ వెలుగు :

అబద్ధాలు చెప్పడం చాలా పాపం. అల్లాహ్ వీరి ప్రార్థనలు అంగీకరించరు. రోజా ఉండి అబద్ధాలు చెబితే రోజా కూడా దీలా పడుతుంది. అంతటి పాపం చేకూర్చే అబద్ధం నుంచి నియంత్రణలో ఉండండి. – పవిత్ర ఖురాన్

పశు వైద్యం.. మరింత పటిష్టం

- వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు ముంగిట్లోకి పశువైద్యం
- పశు సంరక్షణకు వైఎస్‌ఆర్ వెటర్నరీ అంబులెన్స్‌లు
- అత్యవసర సేవలతో పశువులకు తప్పుతున్న ప్రాణాపాయం
- నియోజకవర్గాల వారీగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు

వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం బలోపేతం చేసింది. 108 తరహాలోనే పశువులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చింది. గతంలో పశువులకు జబ్బు చేస్తే పాడి రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పశువైద్యులు లేక, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లలేక అవస్థలు పడేవారు. కొన్ని సందర్భాల్లో ఎంతో ప్రేమగా పెంచుకున్న మూగజీవాలు మృత్యువాత పడేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పశువైద్య సేవలు రైతుల ముంగిటకే వస్తున్నాయి. ఒక్క ఫోన్‌కాల్‌తో పశువు ఉండే చోటుకే నిపుణులైన వైద్యులు వచ్చి వైద్యం అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి ఊరికి పశు వైద్య సహాయకుల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

నందికొట్కూరు: మూగ వేదన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతు ముగింటకు పశు వైద్య సేవలు చేర్చుతోంది. నంద్యాల జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమ, జీవాలతోనే అధిక శాతం మంది జీవనోపాధి పొందుతున్నారు. 28.81 లక్షల పశు సంపద ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పశు వైద్యాన్ని మరింత పటిష్ట పరిచేందుకు వైఎస్‌ఆర్ వెటర్నరీ అంబులెన్స్‌లు, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను నెలకొల్పి మూగజీవాలకు సత్వర వైద్య సేవలు అందిస్తోంది. జిల్లాలో రెండేళ్లుగా ఈ సేవలు విస్తృతంగా అందుతున్నాయి. అవులు, ఎద్దులు, బర్రెలు, సన్న జీవాలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. వ్యాధులతో బాధ పడుతున్నా.. టోల్‌ఫ్రీ నంబరు 1962 ఫోన్ చేస్తే చాలు... అరగంట నుంచి దూరాన్ని బట్టి రెండు గంటల వ్యవధిలో అంబులెన్స్ వచ్చి వైద్య సేవలు అందిస్తోంది. మొదట నియోజకవర్గానికి ఒకటి ప్రకారం వెటర్నరీ అంబులెన్స్‌లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా వైద్య సేవలు మెరుగు పడటంతో నియోజకవర్గానికి అదనంగా మరొక అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌లతో పాటు తాజాగా ప్రతి నియోజకవర్గానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరిట మూగజీవాలకు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను వైఎస్ జగనన్న ప్రభుత్వం నెలకొల్పింది. వీటిల్లో పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ప్రయోగశాలలలో ఇప్పటి వరకు 36,131 వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన వీటిలో పేడ, రక్త పరీక్షలు నిర్వహించడంతో సన్న జీవాలు, పెంపుడు జంతువులకు అక్కడికక్కడే శస్త్రచికిత్సలు చేసే సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితి ఎదురైతే పశువును అదే వాహనంలో పశువైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించి, నయమైన తరువాత ఇంటికి తీసుకొస్తున్నారు. ప్రతి అంబులెన్స్‌లో 81 రకాల మందులను అందుబాటులో ఉంచారు. మొబైల్ అంబులెన్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించిన వెటర్నరీ అసిస్టెంటు సర్జన్, కాంపౌండర్ కమ్ ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్ కమ్ అటెండరు ఉంటారు.

పశువులకు చేసే పరీక్షలు..

పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో పేడ, రక్త పరీక్షల ద్వారా రోగనిర్ధారణ, రక్త శాతం, తెల్ల రక్త కణాలు, ఎర్ర రక్త కణాలు తదితర పూర్తిస్థాయిలో రక్త పరీక్షలు చేస్తున్నారు. గ్లూకోజ్, ప్రొటీన్, క్రియాటినైన్, కాల్షియం, ఫాస్పరస్, ఎస్‌జీవీటీ, మెగ్నీషియం, బిల్లురుబిన్, అల్బుమిన్ వంటి బయోకెమిస్ట్రీ పరీక్షలు, మూత్రంలో గ్లూకోజ్, ప్రొటీన్, పీహెచ్ శాతం, పాలు, పొదుగు వాపు పరీక్షలు, నాసికా స్రావాల పరీక్షలు, చర్మ వ్యాధి జీవుల పరీక్ష, ఏబీఎస్‌టీ యాంటి బయోటిక్ సెన్సివిటీ పరీక్ష, మిల్క్ కల్చర్, యూటిరైన్ డిశ్చార్జ్ వంటి పరీక్షలు చేస్తున్నారు.

పాడి రైతుకు అండగా..

సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం మరెన్నో రూపాల్లో పాడి రైతు చేయూతనందిస్తోంది. ఇప్పటికే అమూల్ సంస్థ భాగస్వామ్యంతో క్షీర విప్లవానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా పశు పోషణ, కొనుగోలుకు ఆర్థిక సాయం అందిస్తోంది. దేశీయ మేలు జాతి ఆవుల ఫారాల ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. నాణ్యమైన దాణా అందించేందుకు తయారీ, అమ్మకందార్లకు లైసెన్సులు తప్పనిసరి చేసింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పశువులు మృతి చెందితే వైఎస్సార్ బీమా సాయం అందించడం ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలతో పాడి పరిశ్రమ క్రమక్రమంగా మళ్లీ పుంజుకుంటుంది.

పశువులకు హెల్త్‌కార్డులు

అన్ని రకాల పశువులకు 1.57 లక్షల ఆరోగ్య కార్డులు ప్రభుత్వం జారీ చేసింది. ఇప్పటి వరకు పశువులకు వైఎస్సార్ బీమా పథకం వర్తించేందుకు దాదాపు 3,160 పశువులకు ప్రభుత్వమే రూ.40.50 లక్షల ప్రీమియాన్ని చెల్లించింది. ఇప్పటి 11.80 లక్షల గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశారు. 3.62 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీ కాలు వేశారు.



నందికొట్కూరు మండలం అల్లూరులో ఓ రైతుకు చెందిన గొర్రె కడుపులో పిల్ల చనిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. 1962కి ఫోన్ చేయడంతో పశు వైద్యాధికారి షణ్ముకరాజు గ్రామానికి చేరుకుని గొర్రెకు ఆపరేషన్ చేసి కాపాడారు.



రుద్రవరం మండలం శ్రీరంగాపురానికి చెందిన గేదె ఈనేందుకు కష్టమై అస్వస్థతకు గురైంది. సమాచారం అందుకున్న పశు వైద్య సిబ్బంది అంబులెన్స్‌తో గ్రామానికి చేరుకుని గేదెకు సకాలంలో వైద్యం అందించడంతో దూడకు జన్మనిచ్చింది.

రూ. 100 కోట్లతో ఆధునిక పరికరాలు..



ఆత్మకూరులోని అగ్రిటెస్టింగ్ ల్యాబ్

ప్రతి ల్యాబ్‌లో భవనం నవీకరణకు రూ.2.50 లక్షలు, పరీక్షలకు అవసరమైన అత్యాధునిక యంత్ర సామగ్రికి రూ.11 లక్షలు కలిపి రూ. 13. 50 లక్షల చొప్పున వెచ్చించారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా ఏడు ల్యాబ్‌లకు దాదాపు రూ. 100 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఈ ల్యాబ్‌లలో 2020 నుంచి వైద్య పరీక్షలు చేస్తున్నప్పటికీ దశల వారీగా వీటి మరింత అభివృద్ధి చేశారు. నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంతో పాటు బనగానపల్లె, డోన్, ఆత్మకూరు నియోజకవర్గాలలో డిపార్ట్‌మెంట్ ల్యాబ్‌లు, నందికొట్కూరు, పాణ్యం, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్‌లను నెలకొల్పారు.

జిల్లాలో ఇప్పటి వరకు ప్రయోగశాలల వారీగా చేసిన పరీక్షలు

నియోజకవర్గం	ల్యాబ్ పరీక్షలు
బనగానపల్లె	4,422
డోన్	6,172
ఆత్మకూరు	4,857
నంద్యాల	4,250
నందికొట్కూరు	3,945
పాణ్యం	5,917
ఆళ్లగడ్డ	6,568
మొత్తం	36,131

జిల్లాలో పశువుల వివరాలు (లక్షల్లో)

పశువులు	సంఖ్య
గేదెలు	2.93
ఆవులు	4.14
గొర్రెలు	8.30
మేకలు	3.59
కోళ్లు	7. 05
పందులు	2.80
మొత్తం	28.81



1962 అంబులెన్స్ వద్ద సిబ్బంది

పాడి రైతులకు ఎంతో మేలు



గత ప్రభుత్వ హయాంలో పశువులకు కనీసం మందులు కూడా అందుబాటులో ఉండేవి కావు. ఆసుపత్రులు ఎప్పుడు తెరుస్తారో తెలిసేది కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటింటికీ వచ్చి పశువులకు ఉచితంగా వైద్యం చేసి మందులు ఇస్తున్నారు. మాకు 20 బర్రెలకు గాను మూడు పాలు ఇస్తున్నాయి. పాలిచ్చే రెండు బర్రెలకు ఆరోగ్యం బాగలేకపోతే 1962కు ఫోన్ చేసినా.. క్షణాల్లోనే వాహనంతో పాటు వైద్యులు వచ్చి చికిత్స అందించారు.
– హుసేన్‌బీ, పాములపాడు

ఫోన్ చేస్తే చాలు



మాకు ఎద్దులు, బర్రెలు ఉన్నాయి. అవి అనారోగ్యానికి గురైతే 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు నందికొట్కూరు నుంచి అర గంటలో పశు వైద్యులు అంబులెన్స్‌లో వచ్చి పరీక్షించి మందులు ఉచితంగా ఇస్తారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం అమలు చేయడం లేదు. జగనన్న పెద్ద మనసుతో మూగ జీవాలకు వైద్యం అందించేందుకు ల్యాబ్‌లు కూడా కట్టించారు. – రామచంద్ర
చింతలపల్లి గ్రామం, మిడుతూరు మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పశువులు వ్యాధి బారిన పడితే 1962కు ఫోన్ చేసి కచ్చితంగా పశు వైద్యులను సంప్రదించేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. పశువుల వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చు. ప్రభుత్వం అన్ని సేవలు ఉచితంగా అందిస్తోంది. పశువులు రోగాల బారిన పడకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పశువులు పేపర్లు, కవర్లను తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– డాక్టర్ గోవిందనాయక్,
నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

న్యూస్‌రీల్

2,056 మంది విద్యార్థుల గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,056 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని 134 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించామన్నారు. 27,748 మంది విద్యార్థులకు గాను 25,692 మంది పరీక్షకు హాజరైనట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా పది ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 34 కేంద్రాలను, స్టేట్ అబ్జర్వర్ గంగాభవానీ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు.

టీడీపీ అభ్యర్థి బుడ్డాపై కేసు నమోదు

బొమ్మలసత్రం: తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరులో నిర్వహించిన ఓ సమావేశంలో వలంటీర్లపై బుడ్డా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవి కోడ్ ఉల్లంఘన కిందకు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అలాగే నంద్యాల పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నలుగురు ఆటోలపై రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు అంటించుకోవడంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను గుర్తించుకుని మెలగాలని ఎస్పీ కోరారు.

ఒంటిమిట్టకు తలంబ్రాలు



ఊరేగింపుగా తలంబ్రాలను తీసుకెళ్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామ నవమి పర్వదినాన వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి పట్టణంలోని మన ఊరు, మనగుడి–మన బాధ్యత సంస్థ సభ్యులు శనివారం తలంబ్రాలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక సంజీవనగర్ రామాలయంలో తలంబ్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈర్నపాడులో సేంద్రియ ఎరువులతో ప్రత్యేకంగా పండించిన వడ్లను మహిళలచే శ్రీరామనామ జపంతో గోటితో ఒలిచి ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణానికి అక్షింతలుగా ఉపయోగిస్తారన్నారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, సూరయ్య, పగడాల నాగేశ్వరయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనానికి అధ్యాపకులు హాజరు కావాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగే ఇంటర్ కెమిస్ట్రీ మూల్యాంకనానికి ఆ విభాగం అధ్యాపకులు హాజరు కావాలని డీవీఈఓ సునీత తెలిపారు. అధ్యాపకులను స్పాట్ మూల్యాంకనానికి ప్రిన్సిపాళ్లు రిలీవ్ చేయాలన్నారు. లేనిచో రోజుకు రూ.1000 జరిమానా విధిస్తామన్నారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా

- ప్రశాంత ఎన్నికలకు ప్రణాళికలు రూపొందించుకోండి
- ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి
- రేంజ్ పరిధి ఎస్పీలకు డీఐజీ ఆదేశం

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెంచాలని డీఐజీ సీహెచ్ విజయరావు కర్నూలు రేంజ్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే కేంద్ర సాయుద బలగాలతో కవాతు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేవ్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించి నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలన్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి శనివారం కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో డీఐజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతగా పనిచేయాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలను మీడియాకు వెల్లడించాలని, బందోబస్తు విధులకు కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ డే రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు

ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పైఅధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలతో రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలన్నారు. లైసెన్స్ ఆయుధాలన్నింటినీ డిపాజిట్ చేయించాలని, ఇంటిగ్రేటెడ్ , బార్డర్ చెక్‌పోస్టుల్లో పోలీసులు, సెబ్, ఫారెస్ట్, ఆర్‌టీఏ అధికారులు సమన్వయంతో పనిచేసే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయాలన్నారు. సీ విజిల్ యాప్‌లో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పేకాటపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, సిద్ధార్థ కౌశల్, కృష్ణారావుతో పాటు ఆయా జిల్లాల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ప్రతి హామీని అమలు చేశాకే ఓటడుగుతున్నాం

- 99 శాతం వాగ్దానాలు నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- 28న నంద్యాలలో 'మేమంతా సిద్ధం' సభ
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పి.రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: 2019 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ధైర్యంగా మళ్లీ ఓటు అడుగుతున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రకటించిన వాగ్దానాల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోను కరివేపాకులా తీసి పడేశాయని.. ఒక్క వైఎస్ జగన్ మాత్రమే చిత్తశుద్ధితో అమలు చేశారని చెప్పారు. ఈనెల 28వ తేదీన నంద్యాలలో నిర్వహించే 'మేమంతా సిద్ధం' సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పి.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, గంగుల బిజేంద్ర రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, మహేశ్వరరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, పార్టీ నేతలతో కలసి శనివారం నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ రెసిడెన్సీలో సమీక్ష నిర్వహించారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 27వ తేదీ నుంచి 'మేమంతా సిద్ధం' అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇడుపులపాయ నుంచి బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని చెప్పారు. సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాల్లో మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. దాదాపు మూడు వారాల పాటు సాగే బస్సు యాత్రలో భాగంగా సీఎం జగన్ ప్రజాక్షేత్రంలోనే ఉంటారని చెప్పారు. తమ ఐదేళ్ల పాలన చూసి ఓటు వేయండని ప్రజలను కోరతామన్నారు.



నంద్యాల ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన, రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని, శిల్పా రవి తదితరులు

27న ఆళ్లగడ్డలో సీఎం బస..

బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 27వ తేదీ ఆళ్లగడ్డకు చేరుకుంటారని ఉమ్మడి కర్నూలు జిల్లా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. అదే రోజు రాత్రి ఆళ్లగడ్డలోనే బస చేస్తారని చెప్పారు. 28వ తేదీ నంద్యాల ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వ్యాప్తంగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ పిలుపునిస్తే రాప్తాడు సభకు 10 లక్షల మందికి పైగా తరలివచ్చారన్నారు. సచివాలయాల ఏర్పాటుతో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 2014 ఎన్నికల ముందు ఆ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిందని ఈ సందర్భంగా రామ సుబ్బారెడ్డి గుర్తు చేశారు. గత టీడీపీ పాలన.. ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సభ జరగనున్న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు పరిశీలించారు. సభ నిర్వహణ, తదితర అంశాలపై వారు చర్చించారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేద్దాం

- మహిళలకు ఒక్క మంచి చేయని చంద్రబాబును నమ్మొద్దు
- ఏపీలో మహిళల కోసం అమలు చేసే పథకాలు దేశానికే ఆదర్శం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



జగనన్నను గెలిపించుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ విజయ సంకేతం చూపిస్తున్న మహిళా నేతలు, ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో మహిళలంతా ఏకమై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత పిలుపునిచ్చారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం సాయంత్రం కర్నూలు, నంద్యాల జిల్లాల మహిళా విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. పద్నాలుగేళ్లు సీఎంగా చేశానని చెప్పుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలకు ఒక్క మంచి కూడా చేయలేదన్నారు. పచ్చ మీడియాను అడ్డుపెట్టుకొని అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీపై నిత్యం బురదజల్లే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. మహిళలకు ఇళ్లు ఇస్తే కోర్టులో కేసులు వేసి చంద్రబాబు అడ్డు తగిలారన్నారు. జగనన్న పేదల పక్షపాతి అయితే చంద్రబాబు పేద ప్రజల ద్రోహి అన్నారు. ఐదేళ్ల పాలనలో వివిధ పథకాల కింద రూ.2.65 లక్షల కోట్లు ప్రజలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏపీలో మహిళల కోసం అమలు చేసే పథకాలు దేశానికే ఆదర్శమ న్నారు. జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత మహిళలపై ఉందన్నారు.

➤ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లలో 140 సార్లు బటన్ నొక్కి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి మహిళా రెండు సార్లు బటన్ నొక్కి ఫ్యాన్ గుర్తును, పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

➤ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రజలకు అండగా ఉన్నామన్న అక్కసుతో తన కుటుంబానికి చంద్రబాబు నాయుడు కోలుకోలేని నష్టం చేశారన్నారు. జగనన్న తనకు అండగా నిలిచి రెండోసారి సైతం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారన్నారు.

➤ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ.. మంచి పాలన అందిస్తున్న జగనన్నను మనందరం గెలిపించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జగనన్న మహిళలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు.

➤ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శశికళా రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ,

➤ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు ఆర్థికంగా రాజకీయంగా, సామాజికంగా న్యాయం జరిగిందన్నారు. మహిళల కోసం చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్ పర్సన్ శిరోమణి మద్దయ్య, పార్టీ మహిళా విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ గాజుల శ్వేతారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక మాట్లాడుతూ.. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి మహిళకు లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సమావేశంలో కర్నూలు నంద్యాలకు చెందిన మహిళా విభాగం నాయకురాలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాణ్యం అభ్యర్థులు కర్నూలులో నామినేషన్ వేయాలి

● స్పష్టం చేసిన ఈఆర్‌ఓ, జేసీ మౌర్య

పాణ్యం: పాణ్యం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే అభ్యర్థులు కర్నూలులోనే నామినేషన్ వేయాల్సి ఉంటుందని పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌ఓ, కర్నూల్ జేసీ నారపు రెడ్డి మౌర్య అన్నారు. శనివారం పాణ్యం తహసీల్దార్ కార్యా లయంలో ఆమె విలేకర్ల సమావే శం నిర్వహించి మాట్లాడారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలంలో అత్యధిక ఓటర్లు ఉన్నారని, దీనికితోడు ఈఆర్‌ఓ ఎక్కడుంటే అక్కడే నామినేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు. మే 13న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరు సహకరించాలన్నారు.ఎక్కడైనా మద్యం, నగదు, ఇతర విలువైన వస్తువుల పంపిణీ జరుగుతుంటే తక్షణమే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నా రు. నియోజకవర్గంలో 64 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో 2 కల్లూరు, 17 ఓర్వకల్లు, 4 పాణ్యం, 11 గడివేముల మండలాల్లో గుర్తించినటుల్ల తెలిపారు. 85 ఏళ్లు పైబడిన వారు ఇంటి నుంచే ఓటు వేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, అలాంటి వారు ఎవరైనా ఉంటే ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

27న పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

శ్రీశైలం: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైల ప్రాంగణంలో పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రాంగణం పీఠాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్యాణ వైభోగమే..

● నయనానందకరం.. శ్రీ ప్రహ్లాదవరదుడి కల్యాణం
● పరవశించిన భక్తజనం



ఎదుర్కోల్లు నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: సకల కల్యాణ గుణ పరిపూర్ణుడైన దేవదేవుడు వరదహస్తుడై ఆశీర్వదించిన వేళ.. స్వామి వారి కరుణాకటాక్ష వీక్షణాలకై భక్తజనం పోటెత్తిన సమయాన.. వేద మంత్రోచ్చారణల నడుమ దిక్కులు పిక్కటిల్లేలా 'ఉగ్రం వీరం మహావిష్ణుం.. ఓం నమో నారసింహాయ' అంటూ నామస్మరణలు విన్నంటిన శుభ సమాయాన.. విద్వాంసుల సొంపైన మంగళ వాయిద్యాలతో జరిగిన జగత్కల్యాణం అందర్నీ ఆనందపారవశ్యంతో ముంచెత్తింది. ఆ అపూర్వ ఘట్టం భక్తకోటి హృదాయాల్లో ఆధ్యాత్మిక వైభవాన్ని నింపింది.. నల్లమల పులకించింది.. శ్రీ లక్ష్మీనరసింహస్వాముల తిరుకల్యాణ మహా ఘట్టాన్ని చూసిన భక్తుల హృదయం పరవశించింది.

కనుల పండువగా..

అహోబిల పుణ్యక్షేత్రంలో శనివారం లక్ష్మీనరసింహ స్వామి వారి మహాద్భుత పరిణయోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా వేద పండితులు పుణ్యాహవచనం చేసి నవగ్రహ మంటపరాధన అనంతరం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించిన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను పెండ్లి కూతురు, పెండ్లి కుమారులుగా అలంకరించారు. ఇరువురిని విడివిడిగా పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా పెండ్లి మంటపానికి తోడ్కొని వచ్చి పెళ్లి పీటలపై కొలువుంచారు. ఎదుర్కోల్లు నిర్వహించిన అనంతరం వైష్ణవ ఆచారంగా వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో కల్యాణాన్ని జరిపించారు. యజ్ఞధారణ, జీలకర్ర బెల్లం తతంగాలు చేపట్టాక మాంగళ్య ధారణ నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం పూర్తి చేశారు. స్వామి, అమ్మవారి మీద నుంచి కింద పడ్డ తలంబ్రాలను భక్తులకు పంచి పెట్టారు.

కమనీయం..కాళింగనర్థనోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో శనివారం ఉదయం కాళింగనర్థనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం జరిపారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవారికి అభిషేకం, తొట్టి తిరుమజనం నిర్వహించారు. దిగువ అహోబిలంలో రాత్రి ప్రహ్లాదవరదస్వామి గజవాహనంపై కొలువై మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రత్యేక వాహనంలో తిరుమల వెంకటేశ్వరుని సన్నిధి నుంచి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు.



ఉత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పీఠాధిపతి, అర్చకులు



కాళింగనర్థనోత్సవంలో స్వామి వారు



పట్టు వస్త్రాలు అందజేస్తున్న టీటీడీ అధికారులు

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

● సెక్టోరల్ అధికారుల శిక్షణలో కలెక్టర్



డోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

డోన్/ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా నిర్వహించాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం డోన్, ఆళ్లగడ్డ పట్టణాల్లో ఆయా నియోజకవర్గ సెక్టోరల్ అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనను ఉల్లంఘించిన వారు ఏస్థాయి వ్యక్తి అయినా ఉపేక్షించరాదన్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. ఎవరైనా ఓటర్లను వస్తు, ధన రూపంలో ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తే అడ్డుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సభలు, సమావేశాలతో పాటు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎవరైనా సరే ఎలాంటి కార్యక్రమం చేపట్టినా కూడా రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి మాక్‌పోలింగ్‌పై ఆర్‌డీఓలు మహేశ్వరరెడ్డి, మల్లికార్జున రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసీల్దార్లు, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారులు, పీఓలు పాల్గొన్నారు.

వైభవంగా పదహారు రోజుల పండుగ



రథాన్ని రథమండపంలోకి లాగుతున్న భక్తులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం మహానంది క్షేత్రంలో శనివారం పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవి శంకర అవధాని, శాంతారాంభట్ ఆధ్వర్యంలో ముందుగా యాగశాలలో అంకురాలకు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల తొలిరోజు పుట్టమన్ను తెచ్చి పాలల్లో తడిపిన ధాన్యములతో చేసిన అంకురార్పణ అనంతరం వచ్చిన మొలకలను రుద్రగుండం కోనేరులో శాస్త్రీయంగా కలిపారు. అనంతరం రథం వద్ద రథాంగ దేవతలను పూజించి వారిని స్వస్థానాలకు పంపి రథాన్ని రథ మండపంలోకి చేర్చారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, సిబ్బంది నాగ మల్లయ్య, శ్రీనివాసులు, నాగభూషణం భక్తులు పాల్గొన్నారు.

ఇష్టకామేశ్వరి భక్తుల ఆందోళన



శిఖరేశ్వరం వద్ద భక్తుల ఆందోళన భక్తులు

శ్రీశైలం: శ్రీశైల శిఖరేశ్వరం వద్ద శనివారం ఉదయం ఇష్టకామేశ్వరి దర్శనానికి వెళ్లాల్సిన భక్తులు ఆందోళన చేపట్టారు. అటవీ అధికారులు, స్థానిక చెంచుగిరిజనుల మధ్య తలెత్తిన వివాదాల కారణంగా ఇష్టకామేశ్వరి దర్శనానికి శనివారం కొంత సేపు బ్రేక్ పడింది. దీంతో ముందుగానే టికెట్లు తీసుకున్నా అనుమతించకపోవడంతో వారు పెద్ద ఎత్తున రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో కిలో మీటర్ల మేర వాహనాల రాకపోకలు స్తంభించాయి. అమ్మవారి దర్శనానికి ఒక్కొక్క భక్తుడు నుంచి అటవీ అధికారులు రూ.1000 వసూలు చేస్తారు. ఇందులో సగం అటవీ శాఖకు, మిగతా సగంలో భక్తులను తరలించే వాహన యజమానికి, కొంత స్థానిక చెంచు గూడేలా అభివృద్ధికి కేటాయించారు. కాగా చెంచు గూడేలా అభివృద్ధికి కేటాయించే మొత్తాన్ని కొంత పెంచి, సకాంలో అందజేసి గూడేంలను అభివృద్ధి చేయాలని చెంచులు ఇష్టకామేశ్వరి ఆలయానికి వచ్చే వాహనాలను అడ్డుకున్నారు. దీంతో టికెట్లు తీసుకున్న భక్తులు ఏమి చేయాలో తెలియక రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. చెంచుగిరిజనులకు న్యాయం చేస్తామని నిక్కంటి ఫారెస్ట్ రేంజర్ ఆరీఫ్‌ఖాన్ హామీ ఇవ్వడంతో చెంచులు ఆందోళన విరమించారు. అనంతరం భక్తులను ఇష్టకామేశ్వరి దర్శనానికి అనుమతించారు. కాగా మరో ఐదు రోజుల పాటు ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనానికి అనుమతి నిలిపివేస్తున్నట్లు మార్కాపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అప్పావ్ తెలిపారు.

ప్రశాంతంగా ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో శనివారం ఓపెన్ పదవ తరగతి విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం, ఇంటర్ విద్యార్థులకు భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 18 పరీక్ష కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షకు 1,313 మంది విద్యార్థులకు గాను 1,136 మంది విద్యార్థులు హాజరు కాగా 177 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్ పరీక్ష 1,154 మందికి గాను 1,009 మంది హాజరు కాగా 145 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. రాష్ట్ర పరిశీలకులు గంగాభవానీ ఓపెన్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పది ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 18 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.

ప్రొద్దుటూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

● లాడ్జిలోని గదిలో బ్లేడ్‌తో చేతి నరాలు కోసుకున్న రాజశేఖర్‌శర్మ
● కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు
● తన తప్పు లేకున్నా అన్యాయంగా సస్పెండ్ చేశారని సూసైడ్ నోట్



రాజశేఖర్‌శర్మ (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు క్రైం: కర్నూలు జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న నొస్సం రాజశేఖర్‌శర్మ(49) ప్రొద్దుటూరులోని ఓ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లాలోని సంజామల మండలం, నొస్సం గ్రామానికి చెందిన రాజశేఖర్‌శర్మ కొన్నేళ్ల క్రితం ఉద్యోగ రీత్యా కర్నూలులో స్థిరపడ్డాడు. నగర శివారులోని స్కంద లోటస్ విల్లాస్‌లో వారి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన గోనెగండ్ల మండలంలోని పుట్టపాశం గ్రామంలో ఉన్న ఎంపీయూపీ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. భార్య రమాదేవితో పాటు కుమారుడు రిషికుమార్ ఉన్నాడు. కుమారుడు మూడో సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు.

ఈ నెల 21న రాజశేఖర్‌శర్మ ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో ఉత్తర్వులు తీసుకోకుండానే పాఠశాల నుంచి వచ్చేశాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన రాజశేఖర్‌శర్మ 'మా సార్ పిలుస్తున్నాడు.. బస్టాండు వరకు వెళ్లొస్తానని' చెప్పి వెళ్లాడు. అయితే రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నగరమంతా గాలించారు. 24 గంటలు గడిచినా ఇంటికి రాకపోవడంతో కర్నూలులోని 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మూడు రోజులుగా లాడ్జిలో ఉంటూ..

రాజశేఖర్‌శర్మ 21న కర్నూలు నుంచి నేరుగా ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఒక లాడ్జికి వెళ్లి రాత్రి అక్కడే పడుకున్నాడు. మూడు రోజులుగా అతను లాడ్జిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం అతను చేతులకు రక్తం కార్చుకుంటూ లాడ్జి గదిలో నుంచి బయటికి వచ్చాడు. రక్తంతో ఉన్న అతన్ని చూసి లాడ్జి నిర్వాహకులు వెంటనే ఫోన్ చేయడంతో 108 అంబులెన్స్ వచ్చింది. అయితే అంబులెన్స్ సిబ్బంది వచ్చి చూసేలోపే రాజశేఖర్‌శర్మ చనిపోయాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రెండు చేతుల నరాలను కోసుకోవడం వల్ల తీవ్ర రక్తస్రావమై అతను చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు రాసుకున్న సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నన్ను అన్యాయంగా సస్పెండ్ చేశారు..

'నా పై అధికారులు నాతో మాట్లాడలేదు.. ఏం జరిగిందో నన్ను అడగకుండానే ఉపాధ్యాయుల మాట విని నన్ను సస్పెండ్ చేశారు. నేను ఏ తప్పు చేయలేదు. విద్యార్థులతో చనువుగా ఉండటం తప్పా! చివరకు చిన్న పిల్లల చేత ఉపాధ్యాయులు నాపై తప్పుడు ఫిర్యాదు ఇప్పించారు. ఇది చాలా అన్యాయం సార్. నేను ఏ తప్పు చేయలేదు..' అని రాజశేఖర్‌శర్మ సూసైడ్ నోట్‌లో రాసుకున్నారు.

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలనగావించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోని ఆ లక్ష్య సాధన దిశ గా చదువులో రాణించాలన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఎందులో ఎక్కువగా ఆసక్తి చూసుతున్నారో గుర్తించి ఆ వైపుగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆర్ఎస్ రెడ్డి, ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ షేఖాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



జి షాషావలి (ఫైల్)

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఖాజీ వాడలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు జి షాషావలి(57) శనివారం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఇతను మండలంలోని యనకండ్ల గ్రా మంలోని ఎంపీపీయూపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో భాగంగా శనివారం ఉదయం పరీక్ష కేంద్రానికి చేరుకున్న ఆయన నీరసంగా అనిపించడంతో పరీక్ష కేంద్రం చీఫ్ అధికారి రామకృష్ణ అనుమతితో ఇంటికి వెళ్లిపోయారు. ఇంట్లో కుప్పకూలిపోవడంతో కుటుంబీకులు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా వైద్యులు పరీక్షించి అప్పటికే షాషావలి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య షాంషున్నీసా, కూతురు తబుసం, కుమారుడు అజ్మత్ ఉన్నారు.

ఎమ్మెల్యే కాటసాని సంతాపం

తన చిన్ననాటి స్నేహితుడి షాషావలి ఆకస్మిక మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఖాజీవాడలోని షాషావలి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాషావలి, తాను ఒకే పాఠశాలలో చదువుకున్నామన్నారు.